ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలి

షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో అపర్ణ

షాబాద్, జూన్ 15: అర్హులైన వారు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు గతంలో దరఖాస్తు చేసుకున్న రసీదులు తీసుకురావాలని సూచించారు. గృహజ్యోతి పథకాలతో పాటు ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో హన్మంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు

యాచారం : ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన సమస్యలపై ప్రజాపాలన కేంద్రంలో ఫిర్యాదు చేసుకోవాలన్నారు. గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన సేవాకేంద్రం నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ అన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

చేవెళ్లటౌన్ : పేదలు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మండల సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగిన ప్రజా పాలనలో గృహ జ్యోతికి సంబంధించి 8 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకం కింద ప్రతి పేదకుటుంబానికీ 200 చొప్పున యానిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం ఇస్తుందన్నారు. అందుకు దరఖాస్తు చేసుకోని వారు అర్జి పెట్టుకోవాలని తెలిపారు.

ఈ సేవా కేంద్రం ప్రారంభం..

ఆమనగల్లు : ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు గతంలో దరఖాస్తు చేసుకోని వారు పురపాలక కార్యాలయంలోని ఈ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వసంత మాట్లాడుతూ అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

మంచాలలో..

మంచాల : మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం మంచాల ఎంపీడీవో బాలశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో భాగంగా గతంలో దరఖాస్తులు చేసుకోని వారు సేవా కేంద్రంలో అర్జి పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హాజరైన లబ్ధిదారులు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, జూన్ 15 : ప్రజాప్రభుత్వంలో మహిళల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మండలంతో పాటు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలకు చెందిన 92మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించిందని, త్వరలో మరిన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. రాబోయే రోజుల్లో మహిళలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం తోడ్పాటునందించనుందన్నారు. అలాగే, త్వరలోనే ఆడపిల్లల వివాహానికి తులం బంగారం కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ మహిపాల్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి ప్రవంతి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మంగ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకల మధుసూదన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని శివగార్డెన్‌లో తహసీల్దార్ రవీందర్‌దత్తు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 113 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్, జడ్పీటీసీ దాస్‌గౌడ్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ సంపూర్ణ, తహసీల్దార్ రవీందర్‌దత్తు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, విజయశేఖర్‌రెడ్డి, చిరంజీవి, మాజీ సర్పంచ్‌లు యశోదాఊషయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, ఎంపీటీసీలు వెంకటేశ్, బాలమ్మ, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, గీత, శ్రీలత పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కడ్తాల్, జూన్ 15: నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత అన్నారు. శనివారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని విత్తనాల షాపులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాలు, ఎరువుల నిల్వలు, రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ-పాస్ ద్వారానే విత్తనాలను విక్రయించాలని డీలర్లకు సూచించారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో వందన, డీలర్లు జితేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రావిచేడ్ గ్రామంలో విత్తనాల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యాచారం, జూన్15: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీ జ్యోతీఅరవింద్ తెలిపారు. మండలంలోని మంథన్ గౌరెల్లి గ్రామంలో శనివారం పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ఎంపీటీసీ అందజేశారు. అనంతరం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన తండాల పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ మాట్లాడుతూ..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడుల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ యశోదమ్మ, ఎక్స్‌అఫిషియో మెంబర్ వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారం : విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న ఎంపీపీ

షాద్‌నగర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ

బడిబాటలో పాల్గొన్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

ఖాజీగూడ తండా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు

కొత్తూరు, జూన్ 15 : బడీడు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొడిచెర్ల, కొడిచెర్ల తండా, ఖాజీగూడ తండా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరిగిన బడిబాట కార్యక్రమాల్లో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యునిఫామ్స్ కొడిచెర్ల ఎంపీటీసీ రవీందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మట్లాడుతూ ఖాజీగూడ తండా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు సీతారాంనాయక్, మోహన్‌నాయక్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బిచ్యనాయక్, విష్ణునాయక్ పాల్గొన్నారు.

యాచారం తహసీల్దార్ బదిలీ

యాచారం, జూన్15: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అయ్యప్ప బదిలీపై వెళ్లారు. ఆయనను యాచారం నుంచి మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు డిప్యుటేషన్‌పై పంపిస్తూ కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మండలానికి నూతన తహసీల్దార్‌ను త్వరలోనే నియమించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిగామ, జూన్15: మండలంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పట్టపగలే ఇద్దరు దుండగులు హుండీని పగలగొడుతుండగా స్థానికులు వారిని పట్టుకునే యత్నం చేశారు. ఇందులో ఒక దుండగుడు పరారీ కాగా ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన దుండగులు వలస కార్మికులుగా గుర్తించారు. ఆలయ నిర్వాహకులు నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాలల్లో అక్షరాభ్యాసం

నోముల పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి

పెద్దఅంబర్‌పేట, జూన్ 15: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధి మర్రిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ పాశం అర్చన, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆకుల స్వాతి ఆధ్వర్యంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ వహీద్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సుధ, బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి పాశం దామోదర్ పాల్గొన్నారు.

నోముల పాఠశాలలో..

మంచాల : బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం నోముల పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలూనాయక్, నవనీత, విజయ్‌కుమార్, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ నవనీత పాల్గొన్నారు.

పాల బిల్లులు వెంటనే చెల్లించాలి

జాతీయ రహదారిపై పాలను పారబోసి నిరసన తెలిపిన పాడి రైతులు

కడ్తాల్, జూన్ 15: పాల బిల్లులు వెంటనే చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు, రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 45 రోజులుగా పాల బిల్లులు రాకపోవడంతో శనివారం మండల కేంద్రంలో పాల సొసైటీ సంఘాల అధ్యక్షులు, పాడి రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల బిల్లులు సకాలంలో రాక పశు పోషణ భారమవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే పాల బిల్లులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బిల్లులు విడుదల చేయాలని కోరుతూ కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికను రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారి వెంట రామకృష్ణ, సుధాకర్, కృష్ణయ్య, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్, జంగయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, రాజు, రామచంద్రయ్య, పెంటయ్య, దశరథ్, ప్రశాంత్, అనిల్, మల్లేశ్, అంజయ్య పాల్గొన్నారు.

హైదాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అక్రమ వెంచర్ కూల్చివేత

తుర్కయాంజాల్, జూన్ 15 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ సర్వే నంబర్ 338లో వెలసిన అక్రమ వెంచర్‌ను శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది వెంచర్‌లోని రోడ్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేశారు. సర్వే నెంబర్ 338లో సుమారు 2 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్‌కు అనుమతులు లేకపోవడంతో చర్యలు తీసుకున్నామని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌లో రోడ్లను ధ్వంసం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఘన సన్మానం

చేవెళ్లటౌన్, జూన్ 15: అమెరికాలో 18వ ఆటా మహాసభల్లో పాల్గొని తిరిగి స్వదేశానికి వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జూన్ 15 : ఆర్థిక ఇబ్బందులతో బీటెక్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంబీఆర్‌నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం జిల్లా మామునూరు గ్రామానికి చెందిన సంగెపు నరేంద్ర(27) ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుకుంటూ ఎరోస్పేస్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నరేంద్ర తాను ఉంటున్న ప్రైవేటు హాస్టల్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న హాస్టల్ యజమాని వేణు శనివారం తెల్లవారుజామున మృతుడి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తెలిపాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఏరియా దవాఖానకు తరలించి అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

అధికారుల బెదిరింపుల నుంచి కాపాడండి

ఎమ్మెల్యేకు సీపీఐ నాయకుల వినతి

ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 15: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామ రెవెన్యూ భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలను బెదిరిస్తున్న రెవెన్యూ అధికారుల నుంచి కాపాడాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సీపీఐ నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ తెలిపారు. గుడిసెలు తొలగించకుండా ఉండేందుకు తన వంతు సాయం చేస్తానని భరోసా ఇచ్చినట్టు చెప్పారు.

సహకార సంఘాల అభ్యున్నతికి సహకరించాలి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం ఐసీఎం శ్యామ్‌కుమార్

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 15 : సహకార సంఘాల ద్వారా రైతులకు అందజేస్తున్న స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం ఐసీఎం శ్యామ్‌కుమార్ అన్నారు. కేంద్ర కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి సహకారంతో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని దండుమైలారం సహకార సంఘాల్లోని రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ.. రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లించి సహకార సంఘాల అభ్యున్నతికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంఘం డైరెక్టర్ అయ్యప్పరెడ్డి, సెక్రటరీ దన్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే

చేవెళ్ల రూరల్, జూన్ 15 : గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే మండల పరిధిలోని గ్రామాల్లో జోరుగా సాగుతున్నది. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని పల్గుట్ట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టి వివరాలు సేకరించారు. గ్రామంలో ఇంటింటికీ నీటి కనెక్షన్లు ఉన్నాయా.. నీరు సక్రమంగా సరఫరా అవుతుందా.. లేదా అనే అంశాలపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

షాద్‌నగర్‌టౌన్, జూన్ 15 : షాద్‌నగర్ యువ సైనిక్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది ఆర్మీ ఉద్యోగాలను సాధించిన వరణ్‌రెడ్డి, చల్మారెడ్డిని శనివారం అకాడమీ నిర్వాహకుడు, నేషనల్ అథ్లెట్ కోచ్ గిరి ఘనంగా సన్మానించారు. ఆర్మీ అగ్నివీర్ 2023సంత్సరంలో 11మందికి ఆర్మీ ఉద్యోగాలు వచ్చాయని, అందులో ఐదుగురు సెలవులపై వచ్చారన్నారు. అదే విధంగా ఆర్మీ అగ్నివీర్ 2024వ నోటిఫికేషన్ ఎగ్జామ్ క్వాలిఫై అయిన విద్యార్థులకు ఈ నెల 20నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9493434907, 9848947484లను సంప్రదించాలని కోరారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 15 : ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు ఎంతో కష్టపడాలని మల్టినేషన్ కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్, వర్చూసా క్యాంపస్ ఇండియా మేనేజర్ అభిషేక్ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ అచీవర్స్‌డే, ఇంజినీరింగ్ కోర్సు ముగింపు వేడుకలు కళాశాల చైర్మన్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ పూర్తిచేసుకున్న 1000మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను వెలికితీసి పేటెంట్స్ సాధించిన వారికి సర్టిఫికెట్లు, ఇంటర్నేషనల్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్‌చైర్మన్ విభవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు సెంథిల్‌కుమార్, చంద్రశేఖర్, అభ్యుతరావు, అశోక్‌కుమార్ తదితరులున్నారు.

సాంకేతిక రంగంలో పట్టు సాధించాలి

మొయినాబాద్ : ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సాంకేతిక రంగానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డబ్ల్యూఓడబ్ల్యూ హెచ్ఆర్ సంస్థ సలహాదారు కృతీవాసన్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాంకేతిక రంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగం అభివృద్ధి చెందిన తరుణంలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, హెచ్ఆర్ నిపుణులు రంగ, బెర్కాడియా గ్రూప్ హెడ్ హెచ్ఆర్ దేబాశిష్ ఘోష్, హైదరాబాద్ మెట్రో ప్రతినిధి డాక్టర్ రీనా దాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల చైర్మన్ పాండురంగారెడ్డి, తదితరులు

మొయినాబాద్ : సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలి

యాచారం, జూన్15: హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, యాచారం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో హరితహారం కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కల పెంపకం తీరుపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులున్నారు.